క్లుప్తంగా

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న చైర్మన్, ఈఓ, భక్తులు

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవ రాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవా లలో భాగంగా గురువారం పల్లకి సేవ వైభవం గా నిర్వహించారు. పల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరే గించారు. ఈఓ నరసయ్య, ఆలయ చైర్మన్ జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, శ్రీనివాసుల రెడ్డి, జయలక్షుమ్మ, సింగిల్ విం డో చైర్మన్ బాలనాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మండల సమావేశం

కలసపాడు : స్థానిక మండల పరిషత్ సభాభవ నంలో శుక్రవారం ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వ ర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో తాగు నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఉపాధి తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీ మృతి



మృతుడు నరసయ్య

కాశినాయన : మండలంలోని సిద్దాయపల్లె గ్రామానికి చెందిన బొన్నేపాటి నరసయ్య (56) అనే ఉపాధి కూలీ గురువారం మృతి చెందాడు. ఉపాధి అధికారులు, స్థానిక ఉపాధి కూలీలు తెలిపిన వివరాల మేరకు నరసయ్య రోజూ మాదిరిగానే గురువారం కూడా పనికి వచ్చాడని, ఉపాధి పని చేస్తుండగా కుప్పకూలి మృతిచెందినట్లు తెలిపారు. స్థానిక వీఆర్‌ఓ, గ్రామస్తులు పంచనామా చేశారు. ఇంటి యజమాని మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరారు.

ఆధార్ కేవైసీ తప్పనిసరి

చాపాడు : అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకులో సభ్యులు తమ ఆధార్ కార్డును, ఫోన్ నంబర్‌తో కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని బ్యాంకు సీఈఓ జాన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణ చేస్తున్నారని ఇందులో భాగంగా ప్రతి సభ్యుడు అప్డేట్ చేయించుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు మంజూరు కావని పేర్కొన్నారు. అలాగే సహకార సంఘం ఎన్నికలు జరిగినప్పుడు ఓటు హక్కును కోల్పోతారని, రుణాలపై వచ్చే వడ్డీ మాఫీకి కూడా అనర్హులవుతారని, పంట నష్టపరిహారం అందదని వివరించారు. కావున ప్రతి రైతు కేవైసీ తప్పక చేయించుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు, సమస్యలను సెల్ నంబర్ 9959225777కు ఫోన్ చేసి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్‌మార్కెట్ సమీపంలో గురువారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మందిపైగా భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి నెల పౌర్ణమినాడు భక్తులకు అన్నదానం చేస్తామని భక్తులు పాల్గొనాలని శ్రీపాదవల్లభ దత్తాత్రేయస్వామి సేవా సంఘం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చింతకుంట జయచంద్ర, బాలు, లక్ష్మణ్, కిరణ్, రాజేష్, వాసు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని పార్కు సమీపంలో వన్‌టౌన్ పోలీసులు రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలను సీజ్ చేశారు. ఎర్రగుంట్ల మండలంలోని ఆంజనేయపురం శివ, పోట్లదుర్తి గ్రామానికి చెందిన శివారెడ్డి డబ్బు తీసుకొని లారీలకు ఇసుక లోడ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇసుకను గిద్దలూరులో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా లారీ డ్రైవర్లను అరెస్ట్ చేసి, వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పుర ప్రయాణం.. నరకప్రాయం

బద్వేలు పట్టణంలో దశాబ్దాలుగా రోడ్ల విస్తరణ చేయకపోవడంతో ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. అసలే ఇరుకు దారులు.. ఆపై ఆక్రమణకు గురయ్యాయి. మున్సిపాలిటీలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో దుకాణాల ముందు, నడిరోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒక్కోసారి గంటల కొద్దీ వాహనాలు స్తంభించిపోతున్నాయి. ఇరువైపులా దుకాణాదారులు ఆక్రమించడంతో దారి ఇరుగ్గా మారింది.

- విస్తరణకు నోచుకోని రహదారులు
- నిత్యం రద్దీతో ప్రజలకు అవస్థలు
- పెరుగుతున్న ప్రమాదాలు




పోరుమామిళ్లరోడ్డులో వాహనాలు ఎదురెదురుగా రావడంతో స్తంభించిన ట్రాఫిక్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మెయిన్‌బజార్ (పోరుమామిళ్ల రోడ్డు) గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రయాణం నరకప్రాయంగా మారుతుంది. రోడ్డుకు ఇరువైపులా పూర్తిస్థాయిలో ఆక్రమణలు ఉండడంతో రోడ్డు కుదించుకుపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రెండు వాహనాలు ఒకేసారివచ్చినా లేదా ఎదురెదురుగా వచ్చినా వెళ్లే దారిలేక భారీగా వాహనాలు ఆగిపోవడం షరామామూలే అయింది. అసలే ఇరుకు రహదారితో ప్రజలు సతమతమవుతుంటే... ఇదే దారి వెంట రెండు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండడంతో భారీ వాహనాలు ఈ దారి వెంట తిరుగుతూ మరో పెద్ద సమస్యగా మారింది. అంతేకాకుండా ఈ దారిగుండా రెండు మసీదులతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు ఉండటంతో నిత్యం జనసంచారం అధికంగా ఉంటోంది.

ట్రాఫిక్‌తో సతమతం

ఈ సమయంలో వాహనాలు నిలిచిపోయి పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాద సమయాల్లో ఒక్కోసారి 108, ఫైరింజన్ వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ దారిని విస్తరించడానికి గతంలో కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చినప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదు. గతంలో ఆర్‌అండ్‌బి అధికారులు సంబంధిత రహదారిలో ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని ముందుకు వచ్చినప్పటికీ చివర్లో కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఈ సమస్య గట్టెక్కాలంటే పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డు వెంట భారీ వాహనాలు, బస్సులను తిరిగేటట్లు చేసి పోరుమామిళ్ల రోడ్డు వెంట ద్విచక్రవాహనాలు, ఆటోలకు మాత్రమే అనుమతిస్తే సమస్య కొంతమేరకైనా పరిష్కారమవుతుందని, ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కల్యాణ.. వైభోగమే



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి, శ్రీదేవిభూదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ మహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున మహాలక్ష్మీదేవికి, చెన్నకేశవస్వామి మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ముత్యాల తలంబ్రాలతో వైభవంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్నదానం చేశారు.



కల్యాణోత్సవంలో శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి

తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కలసపాడు : తహసీల్దారు ఎస్.ఎస్.కృష్ణకుమార్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా సమితి సభ్యులు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలసపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలు ఇంటి నిర్మాణానికి ఒకటి, రెండు ట్రిప్పులు మట్టి తోలుకునేందుకు అనుమతి ఇవ్వమంటే డబ్బులు ఇచ్చేవారికి తహసీల్దారు అనుమతులు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. మండలంలో రాచ్చెరువు, పెండ్లిమర్రి, తంబళ్ళపల్లె చెరువుల్లో యథేచ్ఛగా ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నా రెవెన్యూ సిబ్బంది గాని తహసీల్దారు గాని పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుందని తెలిపారు. తహసీల్దారుపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ మండల కమిటీ అధ్యక్షుడు హుస్సేన్‌పీరా, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓకి వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని పొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్ మోడంపల్లిలో ప్రభుత్వ అనుమతి లేకుండా తరగతులను నిర్వహిస్తున్న ఫేస్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలో గల చారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహి వారి చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి గంధోత్సవంలో భాగంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి ఫకీర్ల మేళ తాళాలతో విన్యాసాలతో గంధం దర్గా వద్దకు చేరి గురువుల మజార్ వద్ద సమర్పిస్తామన్నారు. 25వ తేదీన ఉరుసు, 26వ తేదీన తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

26న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 26న నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 132వ ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు రాయలసీమ నదీ సాహిత్యం అనే అంశంపై బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు



ఇటుగుల్లపాడులో దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు సుధీర్

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామంలో ఎంఈఓ నిర్మల ఆధ్వర్యంలో సమగ్రశిక్ష సహకారంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్నట్లు ఉపాధ్యాయుడు సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర విద్యార్థుల మాదిరిగా వారికి కూడా మంచి భవిష్యత్తును అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందన్నారు. ప్రతి బుధవారం నరసాపురంలో వీరికి ఫిజియోథెరపి చేయడం లాంటి కార్యక్రమాలతో పాటు అవసరమైన పరికరాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మండలంలో ఇటువంటి పిల్లలు ఎవరైనా ఉంటే వారి తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

వైభవంగా సూర్యప్రభ వాహనసేవ



సూర్యప్రభ వాహన సేవపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నరసింహస్వామి సూర్యప్రభ వాహన సేవలో కొలువై భక్తులకు దర్శనమించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో శాంతి హోమం, సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఊంజల్ సేవ, రాత్రి గరుడ సేవ వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

నేడు స్వామివారి కల్యాణం, చక్రస్నానం

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం 9 గంటలకు వైభవంగా కల్యాణం, మధ్యాహ్నం చక్రస్నానం, గజవాహన సేవ, సాయంత్రం ధ్వజఅవరోహణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిత



ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి

మైదుకూరు : పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తిరెడ్డి తెలిపారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ విద్యాసంవత్సరంలో సివిల్, మెకానికల్, ఈఈఈ, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఐటీ, కెమికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లకు అనుమతి లభించిందని ఆయన పేర్కొన్నారు. డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఉచిత హాస్టల్ వసతితో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉంటుందని అన్నారు. మూడు సంవత్సరాలు డిప్లమా కోర్సు పూర్తయిన తర్వాత కూడా బీటెక్‌లో చేరడానికి ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. పాలిసెట్–24 ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కాకపోయినా, పాలిసెట్ రాయకపోయినా కూడా నేరుగా ఏ బ్రాంచ్‌లోనైనా తమ కళాశాలలో ప్రవేశం కల్పిస్తామన్నారు.

అభ్యర్థులకు ఉచిత అవగాహన

పాలిసెట్–24 మొదటి విడత కౌన్సిలింగ్‌కు ప్రకటన వెలువడిందని ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. మే 27వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. పాలిసెట్–24 కౌన్సిలింగ్ అభ్యర్థులకు మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కౌన్సిలింగ్ నుంచి అడ్మిషన్ పూర్తయ్యేంత వరకు తమ సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. వివరాలకు కోసం సెల్ నంబర్ 9347410521కు సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సముద్రాలు



మాట్లాడుతున్న వెంకట కొండయ్య

ప్రొద్దుటూరు : గ్రంథాలయాలు విజ్ఞాన సముద్రాలని వైమానికదళ రిటైర్డు అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.వెంకటకొండయ్య తెలిపారు. గురువారం స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయం వృథా చేయకుండా వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. మెదడుకు మేత లాంటి ప్రశ్నలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థులచేత దేశభక్తి గీతాలను పాడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, రెహ్మాన్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక పూజలందుకొంటున్న సాయిబాబా

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన, సాయిబాబా ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని గో సంరక్షణ శాల, పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. అలాగే సంగాలపల్లె గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గోశాల ప్రాంగణంలోని కృష్ణాలయంలో భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు కాశిరెడ్డినాయన ఆలయంలో జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్.వెంకటకిషోర్‌శెట్టి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోశాలలో నిర్వాహకులు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రామాపురం క్షేత్రంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మోక్షనారాయణస్వామి

కమలాపురం : మండల పరిధిలోని శ్రీరామాపురం పుణ్యక్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవిని సహిత శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన గురువారం అశ్వ వాహనంపై కొలువుదీరిన మోక్షనారాయణస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వార్లకు అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలను నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి



పాల్గొన్న అధికారులు

కమలాపురం : నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ, నియోజకవర్గ స్పెషలాఫీసర్ యదుభూషణ్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో గురువారం నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రోజులుగా అభివృద్ధి పనుల్లో కొంత వరకు వేగం తగ్గిందన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా పనిచేసి తమ పరిధిలోని అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు. వివిధ పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులను కూడా మంజూరు చేసిందని, మిగిలి వున్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేసి పాఠశాలలు తెరిచే నాటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి పుస్తకాలతో పాటుగా యూనిఫాం అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమలాపురం, చెన్నూరు, చింతకొమ్మదిన్నె మండలాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వెనుకబడి వున్నాయని, ఆయా మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వంద శాతం నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోతులూరయ్యస్వామి ఊరేగింపు



జాతర జరిగే ఆలయం

చెన్నూరు : స్థానికంగా వెలసిన ఎల్లమాంబ జాతర ఈనెల 26వ తేదీన ఆదివారం నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎల్లమ్మతల్లి సోదరుడైన పోతులూరయ్యస్వామి ఈనెల 24వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు చెన్నూరులో ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి బియ్యం, బేడలు, పసుపు కుంకుమ సేకరిస్తారు. సేకరించిన పసుపు కుంకుమలను మూడవరోజు ఆదివారం సాయంత్రం చెన్నూరు పోలయ్యగారివీధి నుంచి పోతులూరయ్య స్వామిని రెడ్డివీధి, బ్రాహ్మణ వీధి, పార్కువీధి, పాతబస్టాండు, మెయిన్ రోడ్డు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, విజిలెన్స్, సివిల్ ఇతర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా గంధోత్సవం



గురువుల మజార్ వద్ద ఫాతెహా నిర్వహిస్తున్న దృశ్యం

కమలాపురం : పట్టణంలో వెలసిన హజరత్ షావలి మస్తాన్ వలీ సాహెబ్ గంధోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఏ గఫారియా పీఠాధిపతి ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా స్వామి వారి మజార్‌పై గంధాన్ని సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేసి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు.

పబ్లిక్ ప్రకటన

నా క్లయింట్ అయిన మూర్తల ఇంద్రసేనారెడ్డి, S/o కొండారెడ్డి, R/o P-1, Block-B, డ్యానిష్ లేక్ ఫ్రంట్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, మదీనగూడ, చందానగర్, హైదరాబాద్ సిటీ గారి వలన సరియగు ఇన్‌స్ట్రక్షన్స్ పొంది యావన్మందికీ తెలియజేయడమేమనగా, దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింట్ 20-05-2024వ తేదీన వై.యస్.ఆర్. కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్, జమ్మలమడుగు రోడ్డు నందు D.No. 2/257లో నివాసం ఉన్న పోరెడ్డి రామగోపాల్‌రెడ్డి గారి భార్య పోరెడ్డి జ్యోతి మరియు ప్రొద్దుటూరు టౌన్, శ్రీరాములపేట నందు D.No. 8/45 నందు నివాసం ఉన్న దాసరి సుబ్బరాయుడు గారి భార్య దాసరి భవాణి గారల వలన విక్రయ అగ్రిమెంటు పొందియున్నాడు. దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిపైన ఎవరికైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని, క్లయిములు ఏవైనా ఉన్నచో నా క్లయింట్ యొక్క అడ్రస్సుకు గాని, దిగువ తెలిపిన అడ్రస్సుకు ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపు సరియైన పత్రాలతో తెలుపగలరు. అట్లు లేనిచో దిగువ తెలిపిన ఆస్తి పైన ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు, క్లయిమ్‌లు లేవని నిర్ధారించుకోబడును.

షెడ్యూలు

వై.యస్.ఆర్. కడప డి॥, ప్రొద్దుటూరు సబ్ డి॥, రాజుపాళెం మండలం, చిన్నశెట్టిపల్లె పంచాయతీ, పొట్టిపాడు గ్రామంలో పూర్వము "రాదా రూరల్ వేర్‌హౌస్", ప్రస్తుతం "సుష్మా రూరల్ హౌస్" గోడౌన్లు మరియు జాగాకు నెంబరు వారి వివరం :

పొట్టిపాడు గ్రామ పొలంలోని సర్వే నెం. 189/1గా ఉండి 1B అడంగల్ ప్రకారం సర్వే నెం. 189/1-A యం. 3.42 సెంట్లు గల జాగా, ఇందుకు హద్దులు :

తూర్పు : బయపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లవరం చెన్నమ్మ, మండే లక్ష్మిరెడ్డి గార్ల భూములు, **పడమర** : ప్రొద్దుటూరుకు పోవు రోడ్డు, **ఉత్తరం** : కొత్రపాడుకు పోవు రోడ్డు, **దక్షిణం** : నల్లబాతుల లక్ష్మీనారాయణ గారి భూమి.

Address: V.SUNIL KUMAR REDDY, Advocate, D.No. 7/242, Holmaspeta, Proddatur, 9885430399.